సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

I



ఉయ్యాల పాటలు.. IIలో ▸
తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మపై పాటలు ఉర్రూతలూగిస్తున్నా యి. ఉమ్మడి జిల్లా రచయితలు రచించిన, రూపొందించిన పాటలు ఆకట్టుకుంటున్నాయి.



కొలువుదీరిన దుర్గాదేవి
జిల్లాలోని పల్లె, పట్టణాల్లోని కూడళ్లలో దుర్గా దేవి కొలువు దీరింది. డప్పు చప్పుళ్లు, మంగళ హారతులతో మహిళలు స్వాగతం పలికి పూజలు చేశారు. IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /25.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నష్ట పరిహారం చెల్లింపు పకడ్బందీగా చేపట్టాలి
• ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి రామకృష్ణారావు, రహదారులు, అటవీ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, అటవీ అధికారులు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ సేకరణ వేగవంతం చేయాలని, గ్రీన్‌ఫీల్డ్ హైవే, జాతీయ రహదారుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారి–163జి పరిధిలో పెడింగ్‌లో ఉన్న 130 హెక్టార్ల భూ బదలాయింపు ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారి–163జి పరిధిలో 3వ విడత ఆర్బిట్రేషన్ కోసం దాఖలు చేసిన 114 కేసులు పరిశీలించామని తెలిపారు. జాతీయ రహదారి–63కు సంబంధించి జిల్లాకు చెందిన 17 గ్రామాల్లో కోర్టు స్టే కలిగిన గ్రామాలను మినహాయించి మిగతా గ్రామాల్లో అవార్డు జారీ చేశామని, అక్టోబర్ 30లోగా ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్ అప్రమత్తంగా ఉండాలి



ప్రశంసాపత్రం అందిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝూ

మంచిర్యాలక్రైం/బెల్లంపల్లి: సైబర్ వారియర్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. సోమవారం కమిషనరేట్ ఆవరణలో సైబర్ వారియర్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జాతియ లోక్ అదాలత్‌లో 134 సైబర్ కేసుల్లో రూ.41,81,824 బాధితులకు అందేలా చూశామని తెలిపారు. రికవరీలో ద్వితీయ స్థానం సాధించిన బెల్లంపల్లి వన్‌టౌన్ కానిస్టేబుల్ సంజీవ్‌కుమార్‌ను అభినందించారు. సీఐలు శ్రీనివాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దసరా వేడుకలపై ప్రత్యేక నిఘా
దసరా వేడుకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ పోలీసు అధికారులకు సూచించారు. దసరా, బతుకమ్మ, దుర్గమాత నవరాత్రుల ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజలకు సమస్యలు ఎదురైతే 100 డయల్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

యూరియా కోసం బారులు



మెట్టుపల్లి రైతు వేదిక ఎదుట రైతులు

మందమర్రిరూరల్/భీమిని: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మందమర్రి మండలం శంకరపల్లి గ్రామ పంచాయతీ పరిధి సండ్రోన్‌పల్లి రైతువేదిక వద్ద పొన్నారం రెవెన్యూ శివారు రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేపట్టారు. రైతులు పేపర్లపై పేర్లు రాసి వరుసలో ఉంచారు. ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. కన్నెపల్లి మండలం మెట్టుపల్లి రైతువేదిక ముందు రైతులు బారులు తీరారు. వ్యవసాయ అధికారులు టోకెన్ రాసిచ్చారు. వరి, పత్తి పంటలు అధికంగా ఉన్నాయని, ఒక బస్తా సరిపోదని ఆందోళన చేపట్టారు. ఏవో సాయిప్రశాంత్ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపించామని, రాగానే పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ చేశారు.

శ్రమ ఫలం.. 34శాతం

• సింగరేణి లాభాలు, వాటాను ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
• ఒక్కో కార్మికునికి నగటున రూ.1.95 లక్షలు
• కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500
• క్రితంసారితో పోల్చితే స్వల్ప పెరుగుదలే..
• రీజియన్ పరిధిలో 14,137 మందికి వాటా పంపిణీ



గనిలో కార్మికులు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు చెమటను రక్తంగా మార్చి.. ప్రాణాలు పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తుంటారు. అలాంటి కార్మికుల త్యాగానికి ఏదీ సరితూగదు. కానీ ప్రతీ సంవత్సరం వారి శ్రమ ఫలితంగా లభించే లాభాల వాటా కొంత ఊరటనిస్తుంది. గత ఆరు నెలల నిరీక్షణకు తెరపడింది. కంపెనీ గత 2024–25 ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల నుంచి కార్మికులకు 34శాతం వాటా చెల్లించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కంపెనీ లాభాలు, వాటా ప్రకటించారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం రూ.6,364 కోట్లు లాభాలను ఆర్జించింది. ఇందులో భవిష్యత్ ప్రాజెక్టుల పెట్టుబడుల కోసం రూ.4,034 కోట్లు పక్కనబెట్టి మిగతా రూ.2,360 కోట్లు నికర లాభం చూపించారు. ఇందులో నుంచి కార్మికులకు 34శాతం వాటాగా రూ.802.4 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఏ తేదీన పంపిణీ చేస్తారనేది కంపెనీ అధికారులు త్వరలో ప్రకటిస్తారు. ఏడాదిలో కార్మికుల మస్టర్లు, వ్యక్తిగత, గ్రూపు పనితీరు ఆధారంగా ఈ మొత్తాన్ని పంచుతారు. కంపెనీలో 40,476మంది కార్మికులు లాభాల వాటా పొందుతారు. కనిష్టంగా రూ.లక్ష నుంచి గరిష్టంగా రూ.2.50లక్షల వరకు చెల్లిస్తారు. ఒక్కో కార్మికునికి సగటున రూ.1.95లక్షలు లాభాల వాటా అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

బెల్లంపల్లి రీజియన్ పరిధిలో..
ఆసిఫాబాద్ కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలోని బెల్లంపల్లి రీజియన్ గనుల్లో 14,137 మంది కార్మికులు పని చేస్తున్నారు. బెల్లంపల్లిలో 951, మందమర్రిలో 4652, శ్రీరాంపూర్‌లో 8534 మంది కార్మికులు ఉన్నారు. వీరితోపాటు సుమారు 3,800 మంది కాంట్రాక్ట్ కార్మికులూ లాభాల వాటా పొందనున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు రూ.500 పెంపు
కంపెనీలో ఓబీలు, సివిక్, స్టోర్స్, టింబర్‌యార్డులు, ఇతర డిపార్టుమెంట్లలో సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరికి బోనస్ కింద రూ.17 కోట్లు పంచనున్నారు. క్రితంసారి నుంచే లాభాల బోనస్‌ను ఇస్తున్నారు. మొదటిసారి ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లించారు. ఈసారి రూ.500 పెంచి రూ.5,500 చెల్లించనున్నారు.

మొదటిసారి ఆర్భాటం..
ప్రతీసారి లాభాల వాటాను ముఖ్యమంత్రి, కొద్ది మంది మంత్రులు, సింగరేణి ప్రతినిధుల సమక్షంలో ప్రకటించే వారు. ఈసారి ఆర్భాటంగా ప్రకటన చేశారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు, కోల్‌బెల్ట్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి ప్రకటన చేశారు. ప్రతీసారి కంపెనీ అధికారులు లాభాలు ప్రకటిస్తే వాటాను ముఖ్యమంత్రి ప్రకటించే వారు. ఈసారి లాభాలు, వాటా అన్ని సీఎం చేతుల మీదుగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంస్థ సీఎండీ బలరాంతోపాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్, యూనియన్ ముఖ్య నేతలు హాజరయ్యారు.

పెరిగింది రూ.6.4 కోట్లే..!
క్రితంసారి లాభాల వాటా పంపిణీ తో పోల్చితే ఈసారి మొత్తంగా పంపిణీ చేసే లాభాలు రూ.6.4 కోట్లే పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ వాస్తవ లాభాలు రూ.4,071 కోట్లు ఉండగా భవిష్యత్ ప్రాజెక్టులకు పెట్టుబడులు కింద రూ.2289 కోట్లు పక్కన పెట్టి నికర లాభం రూ.2,412 కోట్లు ప్రకటించి.. అందులో నుంచి 33శాతం వాటా కింద రూ.796 కోట్లు పంపిణీ చేశారు. ఈసారి రూ.802.4 కోట్లు పంపిణీ చేయనున్నారు. క్రితంసారి భవిష్యత్ ప్రాజెక్టుల కోసం పెట్టిన డబ్బుల కంటే అదనంగా రూ.1745 కోట్లు చూపడంతో లాభాలు పెరిగినా వచ్చే వాటా డబ్బులు గతం కంటే స్వల్పమే అయ్యిందని కార్మికులు పెదవి విరుస్తున్నారు.

కంపెనీ లాభాలు, పంపిణీ చేసిన వాటా వివరాలు..

ఆర్థిక సం..	నికర లాభం(రూ. కోట్లు)	వాటా శాతం	పంపిణీ(రూ.కోట్లు)
2020-21	272.64	29	79.06
2021-22	1227	30	368
2022-23	2222.46	32	711.18
2023-24	2412	33	796
2024-25	2360	34	802.4

నిరాశ పరిచారు..
కంపెనీ లాభాల వాటా నిరాశపర్చింది. గతం కంటే లాభాలు పెరిగినందుకు ఎక్కువగా వస్తాయనుకున్నాం. కానీ గుర్తింపు సంఘంతో ముందుగా సంప్రదించకుండా ఏకపక్షంగా వాటా ప్రకటించారు. వాస్తవ లాభాలపై వాటా ప్రకటించి ఉంటే కార్మికులకు మరింత ఆర్థిక ప్రయోజనం జరిగేది.
– వీ.సీతారామయ్య, గుర్తింపు సంఘం అధ్యక్షుడు

మరోమారు మోసం
గత సంవత్సరం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కార్మికవర్గాన్ని మోసం చేసింది. వారి నిజ స్వరూపం బయటపడింది. లాభాలు పెరిగిన కూడా కోత పెట్టారు. గత సంవత్సరం భవిష్యత్ ప్రాజెక్టుల కోసం పక్కన పెట్టిన డబ్బులు ఏం చేశారో ఇప్పటికీ చెప్పలేదు. ఈసారి మిగిల్చిన రూ.4034 కోట్లు ఏ ప్రాజెక్టుల కోసం పక్కన పెట్టారో స్పష్టత లేదు. ఈ మోసాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.
– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

కార్మికుల సంక్షేమమే లక్ష్యం
• రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్



కలెక్టర్ కుమార్‌కు బీపీ పరీక్షిస్తున్న మంత్రి వివేక్

చెన్నూర్: సింగరేణి కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నిర్లక్ష్యాల కారణంగా కొత్త గనులు రాలేదని, యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని ఆరోపించారు. సింగరేణి కార్మికులకు 34శాతం లాభాల బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కమీషన్ల కోసం కట్టిన పెద్ద ఫెయిల్యూర్ ప్రాజెక్ట్ అని ఆరోపించారు. బ్యాంక్ వాటర్‌తో పంటలు నష్టపోతున్నాయని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంటున్నారని, ప్రాజెక్ట్ కట్టిందే ఆ పార్టీ హయాంలో, కేటీఆర్ ఇంటి ముందు ధర్నా చేయాలని హితవు పలికారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే 2 వేల టన్నుల యూరియా వస్తుందని తెలిపారు.

ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం
చెన్నూర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడబిడ్డలకు వరమని మంత్రి వివేక్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలకు కృషి
భీమారం: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివేక్ ప్రకటించారు. మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి స్వతహాగా డాక్టర్ కూడా కావడంతో కలెక్టర్ కుమార్ దీపక్‌కు స్వయంగా బీపీ పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ భీమారంలో రూ.15 కోట్లతో స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. చెన్నూరు నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులకు కృషి చేస్తున్నామని అన్నారు. జిల్లా వైద్యాధికారి అనిత, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టెట్.. కలవరం..!

• ఉత్తీర్ణతకు రెండేళ్ల గడువు
• ఉపాధ్యాయుల్లో నిరాశ



మంచిర్యాలఅర్బన్: విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి కొన్ని సమూల మార్పులు చేశారు. విద్యార్హతలతోపాటు వృత్తి సామర్థ్యాలను మరింతగా పరీక్షించి నాణ్యమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఉద్దేశంతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ప్రవేశపెట్టారు. సర్కారు బడుల్లో బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు జిల్లాలో పని చేస్తున్న టీచర్లను కలవర పరుస్తోంది. విధుల్లో కొనసాగాలన్నా.. పదోన్నతి పొందాలన్నా టెట్ ఉత్తీర్ణతకు రెండేళ్ల గడువు విధించడం ఆందోళనకు గురిచేస్తోంది. 2012 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారు టెట్ అర్హత కలిగి ఉన్నారు. అంతకుముందు బీఈడీతో పరీక్షలు రాసి ఉద్యోగంలో చేరిన వారికి టెట్ లేకపోవడం అయోమయంలో పడేసింది. ఉద్యోగ విరమణకు దగ్గరున్న.. పదోన్నతుల పొందాలనుకునే టీచర్లను నిరాశకు గురిచేస్తోంది.

ఆందోళనలో ఉపాధ్యాయులు
జిల్లాలో మొత్తంగా 2,525 మంది ఉపాధ్యాయులు ఉండగా.. వీరిలో జీహెచ్ఎం 96, ఎస్జీటీలు 1,307, స్కూల్ అసిస్టెంట్లు 1,122 మంది ఉన్నారు. టెట్ రాయకుండా వృత్తిలో కొనసాగుతున్న వారే సగానికి పైగా ఉన్నారని తెలుస్తోంది. టెట్ అర్హత తప్పనిసరి కావడం, రాయని పక్షంలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ, నిర్బంధ తొలగింపు టీచర్లను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎస్జీటీలు వృత్తి ఇంక్రిమెంటు రావాలన్నా, స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్‌లు పొందాలన్నా డిపార్టుమెంటు పరీక్ష ఈవోటీ(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టెస్ట్) రాస్తారు. అందరు టీచర్లకు డిపార్టమెంటు పరీక్ష తప్పనిసరి కాదు. అలా కాకుండా 2012కు ముందు చేరిన వారందరికీ టెట్ అర్హత నిబంధన, పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై ఉపాధ్యాయులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. టెట్ రాయని టీచర్లకు ఇంక్రిమెంట్ లేదనో, మానటరీ బెనిఫిట్స్‌కు అర్హులు కాదనే కొన్ని షరతులు విధిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భిన్నాభిప్రాయాలు
టెట్ నిబంధనపై ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆగస్టు 2010 తర్వాత జరిగిన అన్ని నియామకాలు నిబంధనలకు లోబడి జరుగుతున్నాయి. కానీ అప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని ఎన్‌సీటీఈ నిబంధనల్లో లేదని గుర్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల విద్యాశాఖ ఎక్కడ కూడా వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు టెట్ కలిగి ఉండాలనే ఉత్తర్వులు ఇవ్వలేదని, కేవలం వృత్తిలోకి రావాలనుకునే అభ్యర్థులకు అంశంగా పరిగణించాలని చెబుతున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు పదోన్నతులు పొందాలంటే ఐదేళ్ల పైబడి సర్వీసు ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత పొందాలని, లేదంటే ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందన్న తీర్పుపై ఉపాధ్యాయుల్లో భిన్నభిప్రాయాలున్నాయి. రాష్ట్ర పదోన్నతుల విషయంలో టెట్ అర్హత కలిగిన కొందరు అభ్యర్థులు ఈ అంశం బయటకు తీయడంతో చర్చనీయంశంగా మారింది. ఇప్పటికే 30 ఏళ్లుగా వృత్తిలో ఉంటూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న వారికి టెట్ అర్హత తప్పనిసరి చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

రివ్యూ పిటిషన్ వేయాలి



ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి. టెట్ అర్హతకు రెండేళ్ల గడువు ఇవ్వడం సరైంది కాదు. తప్పనిసరి పాస్ కావాలని ఉన్నప్పుడు సిలబస్ మార్చాలి. అదేవిధంగా గడువు పెంచాలి. క్వాలిఫై మార్క్స్ 60శాతం నుంచి 50శాతానికి తగ్గించాలి. ఇదే విషయంలో తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖాలు చేశాయి. ఎస్టీఎఫ్ఐ యూనియన్ కూడా రివ్యూ పిటిషన్ వేసింది. తెలంగాణ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసేందుకు చర్యలు త్వరగా చేపట్టాలి.
– రాజావేణు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మినహాయింపు ఇవ్వాలి



2010కు ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. సుప్రీంకోర్టు టెట్ అంశంలో తీర్పు ఇచ్చిన నేపథ్యంలో చాలామందిని గందరగోళ పరుస్తోంది. సర్వీసులో ఉన్నవారి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23ను సవరించాలి.
– ధరణికోట వేణుగోపాల్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి
• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



కుమారులపై ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పట్టామార్పిడి తదితర సమస్యలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు.

• లక్సెట్టిపేట బీసీ, బెల్లంపల్లి ఎస్సీ వసతిగృహాల విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం ప్రతినిధులు కోరారు.
• తన కుమారులు తిండి పెట్టడం లేదని, పట్టించుకోవడం లేదని హాజీపూర్ మండలానికి చెందిన వృద్ధురాలు ఫిర్యాదు చేసింది.
• తాండూర్ మండలం గోపాల్ నాగారం గ్రామానికి చెందిన గాజుల తిరుపతి, గాజుల వెంకటేశం, గాజుల రవి తమ తండ్రి పేరిట తాండూర్ గ్రామ శివారులో ఉన్న భూమి రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేరిట చూపుతోందని, ఈ పొరపాటును సవరించాలని అర్జీ అందజేశారు.
• తమ చేనులోనికి వెళ్లడానికి దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు.

గ్రంథాలయ పనివేళలు మార్చాలి



బెల్లంపల్లిలోని కాళోజీ శాఖ గ్రంథాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. పనివేళలు ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కొనసాగిన సమయం పాటించాలి. ఉదయం 7గంటల నుంచి 9 గంటలకు మార్చాలి.
– బెల్లంపల్లి నిరుద్యోగులు

అటవీ హక్కు పత్రాలు అందించాలి



జైపూర్ మండల శివారులో నార్వ, వెంకటపల్లి, దుబ్బపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులం తాతల తండ్రుల కాలం నుంచి అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. జిల్లా అధికారులు ఎస్టీలకు మాత్రమే భూమి హక్కు పత్రాలు అందిస్తామని వివరాలు సేకరించారు. ఎస్సీలమైన మాకు అన్యాయం చేస్తున్నారు. ఈ భూములతోనే జీవనధారం. మాకు హక్కు పత్రాలు అందించాలి.
– ఎస్సీ రైతులు

పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పరీక్షలకు 175 మంది విద్యార్థులకు గాను 136 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు 62 మందికి గాను 53 మంది హాజరు కాగా 9మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఇంటర్ పరీక్ష(అరబిక్ సబ్జెక్టు)కు ఒకే ఒక్క విద్యార్థి హాజరు కావాల్సి ఉండగా రాలేదు. ఒక్క విద్యార్థి కోసం సీఎస్, డీవో, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సిట్టింగ్ స్క్వాడ్, ఆఫీస్‌క్లర్క్, ఇద్దరు పోలీస్‌లు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. జెడ్పీ బాలికల పాఠశాలలో ఇంటర్ పరీక్షలకు 113 మందికి గాను 83 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

తాత్కాలిక మరమ్మతులేనా..!

• నగరంలో రోడ్లు గుంతలమయం
• వర్షాలకు ధ్వంసమై ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: వర్షాలకు మంచిర్యాల నగరంలోని రోడ్లు గుంతలుగా మారుతున్నాయి. దీంతో ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పండుగల నేపథ్యంలో అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి తాత్కాలికంగా డస్ట్ వేసి గుంతలు పూడ్చి వేస్తున్నారు. వర్షానికి ఆ డస్ట్ కొట్టుకుపోయి మళ్లీ గుంతలు తేలి వర్షపు నీరు నిలుస్తోంది. వీధి దీపాలు అంతంత మాత్రంగానే వెలుగుతుండడంతో రాత్రివేళల్లో సరైన వెలుతురు లేక రోడ్లపై వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయకులను తరలించే దారుల్లో డస్ట్ పోసి తాత్కాలికంగా పూడ్చారు. నిమజ్జనం రోజే కురిసిన వర్షానికి డస్ట్ కొట్టుకుపోయి గుంతలు తేలాయి. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో గుంతలు పూడ్చేందుకు మరోసారి టెండర్లు పిలిచారు. 60 డివిజన్లను మూడు రకాలుగా విభజించి రూ.5లక్షల చొప్పున టెండర్లు ఆహ్వానించి పనులు అప్పగించారు. బతుకమ్మ ఆడే ప్రాంతాలకు వెళ్లే దారులు, నిమజ్జనం, జంబికి వెళ్లే దారుల్లో డస్ట్‌తో గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. మళ్లీ వర్షాలు కురిస్తే డస్ట్ కొట్టుకుపోయి రూ.15 లక్షలు వృథా కానున్నాయి.



హైటెక్‌సిటీ కాలనీలోని గుంతల పూడ్చివేత

రూ.30 లక్షలతో అంచనా
నగరంలోని రోడ్ల మరమ్మతుకు రూ.30లక్షలతో అంచనా వేశారు. శాశ్వత పరిష్కారం దిశగా పనులకు అంచనా వేసినా కార్యరూపం దాల్చలేదు. వర్షాకాలంలో ఇతర రోడ్లు సైతం గుంతలుగా మారడంతో ప్రస్తుతం కేటాయించిన రూ.30లక్షలు సరిపోయే అవకాశం లేదని, రూ.50లక్షలు కేటాయించాలనే ప్రతిపాదనలో అధికారులు ఉన్నారు. ప్రతియేటా రోడ్లు మరమ్మతు చేపడితే పనులు కొంతవరకు తగ్గే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ప్రతియేటా పన్నుల రూపంలో రూ.20 కోట్లు వసూలు చేస్తుండగా, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో విఫలమవుతున్నారే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వర్షాకాలం తర్వాత పనులు



మంచిర్యాల నగరంలోని రోడ్ల మరమ్మ తు కోసం రూ.30 లక్షలు కేటాయించి పనులు గుర్తించాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టడం లేదు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలు వెళ్లే రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చేందుకు రూ.15 లక్షలతో టెండర్లు నిర్వహించాం. పూర్తిస్థాయిలో రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చేందుకు వర్షాకాలం పూర్తయిన తర్వాత పనులు చేపడతాం.
– సంపత్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

గోదావరిలోకి భారీగా వరద నీరు



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి గోదావరిలో కలుస్తున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వర్షాలు, ఎగువ ప్రాంతాలు, శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా చేరుతోంది. సోమవారం రాత్రి వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను 19.800 టీఎంసీలు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2 లక్షల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 2 లక్షల క్యూసెక్కులు, కడెం నుంచి 6 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 306 క్యూసెక్కులు తరలిస్తుండగా, 38 గేట్లు ఎత్తి 4.50 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

క్లుప్తంగా

వరద నీటిలోపడి ఒకరు మృతి


మాధవ్ (ఫైల్)

తానూరు: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మద్యం మత్తులో వరదనీటిలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన చిలింకర్ మాధవ్ (35) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనికోసం వెళ్లిన ఆయన రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉమ్రి(కే) బస్టాప్ వద్ద దిగి సమీపంలో ఉన్న కల్వర్టుపై కూర్చునే క్రమంలో అందులో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


భీముడు (ఫైల్)

ఇచ్చోడ: మహారాష్ట్రలోని పాండ్రకొడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసి మృతి చెందాడు. మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన సాదుల భీముడు (60) ఆదివారం ఉదయం పాండ్రకొడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

రైలు కిందపడి తల్లీకూతురు ఆత్మహత్య

- గాయాలతో బయటపడిన భర్త
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తింపు

కాగజ్‌నగర్‌రూరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ తన కుమార్తెతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. బెల్లంపల్లి రైల్వే ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన జగత్‌రాం, స్వప్న (27) దంపతులు 20 రోజుల క్రితం ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చి చింతగూడ సమీపంలో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి కుమార్తె జాస్మి (11నెలలు)తో కలిసి స్వప్న ఆత్మహత్య చేసుకునేందుకు చింతగూడ రైల్వే క్రాసింగ్ వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న జగత్‌రాం వారిని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో స్వప్న, జాస్మి అక్కడికక్కడే మృతి చెందారు. జగత్‌రాంకు తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని యాపల్‌గూడకు చెందిన బొనే గంగారాం (49) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో తరచూ భార్యతో గొడవ పడేవాడు. మద్యం మానేయాలని భార్య జయ ఆదివారం మందలించింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లినవారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..


లక్ష్మణ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని పాత గర్మిళ్లకు చెందిన మిల్కూరి లక్ష్మణ్ (34)కు పదమూడేళ్ల క్రితం త్రివేణితో వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమారులు మణిరుధ్, క్రిష్ ఉన్నారు. కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 21న సాయంత్రం అతిగా మద్యం సేవించాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు రెఫరీగా 'రిక్కల'


వెంకట రామకృష్ణ

రెబ్బెన: తమిళనాడులోని దిండిగల్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగనున్న జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెఫరీగా రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన రిక్కల వెంకట రామకృష్ణ ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా చీఫ్ రెఫరీ జ్యోతిష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణను అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ నారాయణరెడ్డి, అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, షార్ప్‌స్టార్ అసోషియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు అభినందించారు.

రాష్ట్ర మహిళా జట్టు కోచ్‌గా ఎస్.తిరుపతి

రాష్ట్ర మహిళా జట్టు కోచ్‌గా గోలేటికి చెందిన ఎస్.తిరుపతి ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చీఫ్ ప్యాట్రన్ ఆర్.నారాయణరెడ్డి తెలిపారు.



ఉర్రూతలూగించే ఉయ్యాల పాటలు

- కొత్తగా పండుగ విశిష్టత ఆవిష్కరణ
- డీజే మేళవింపుతో కొత్త ఊపు..
- ఊరూరా మార్మోగుతున్న పాటలు

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ. పువ్వులను పూజించే వేడుక. ప్రకృతితో ముడిపడి ఉన్న పండుగ. ఆడపడుచులు వయోభేదం లేకుండా జరుపుకునే ఉత్సవం. ఒకప్పుడు బతుకమ్మ పాటలు అంటే మహిళలు పాడేవారు. ఒక మహిళ పాడితే మిగతావారు గొంతు కలిపేవారు. రెండు దశాబ్దాలుగా పాటలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. డీజే మేళవించి కొత్త జోష్ తెస్తున్నాయి. పాటల రచనలు, చిత్రీకరణతో ఇప్పుడు ఊరూరా ఈ ఉయ్యాల పాటలు మార్మోగుతున్నాయి. బతుకమ్మ పాటలు తెలంగాణ ఆత్మను ప్రతిధ్వనింపజేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కవులు, రచయితలు బతుకమ్మ పాటలను వైవిధ్యంగా రాస్తున్నారు. జిల్లాకే చెందిన మ్యూజిక్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, కెమెరామెన్లు ఈ పాటలను చిత్రీకరించి కొత్త జీవం పోస్తున్నారు. గౌరమ్మను కీర్తిస్తూ, పురాణ కథలను, ప్రజల జీవన కష్టాలను ఆధారంగా చేసుకున్న ఈ పాటలు గ్రామీణ సౌందర్యాన్ని, సంప్రదాయాలను ఆధునిక మేళవింపుతో అందిస్తున్నారు.

యూట్యూబ్ మాధ్యమం..సంప్రదాయ సోయగం


బతుకమ్మ పాట చిత్రీకరణలో జిల్లా కళాకారులు

నిర్మల్‌ఖిల్లా: పల్లెదనం ప్రతిబింబించేలా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిర్మల్ జిల్లా కవులు, కళాకారులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా బతుకమ్మ పాటలను రచించి, సంగీతం, స్వర కల్పన చేస్తూ చిత్రీకరించి జన బాహుళ్యంలో విడుదల చేస్తున్నారు. పాతతరం మహిళల నుంచి సేకరించిన సమాచారంతో పండుగ ప్రశస్త్యాన్ని రంగరించి పాటల రూపంలో తీస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన గొనుగొప్పుల రాజశేఖర్, ఎల్లుల్ల నవీన్, రామ్‌రాజ్ కాంద్రే, గోపి, విలాస్ 'మనఇంటి బతుకమ్మ-2025' పేరిట పాటను సారంగాపూర్ మండలం బోరిగాం సమీపంలో పాట చిత్రీకరణ పూర్తి చేశారు. రాజశేఖర్ కొరియోగ్రఫీ, దర్శకత్వం వహించగా కెమెరా, ఎడిటింగ్ రామ్‌రాజ్ కాంద్రే, పాట రచన, సంగీతం, గాయకుడిగా ఎల్లుల నవీన్ చేశారు. ప్రధానపాత్రల్లో గోపి, రజిని, తదితరులు నటించారు.

భావితరాలకు తెలియజెప్పేందుకే...



బతుకమ్మ పాటల్లో మన భాషా మాధుర్యం, పల్లె జానపద రీతులు ప్రతిబింబించడం భవిష్యత్ తరాలకు సంపద. ఈ పాటలు ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేస్తున్నాం. స్థానిక లొకేషన్లు, కళాకారులతో పాటను ఇక్కడే చిత్రీకరించాం.- గొనుగొప్పుల రాజశేఖర్, డైరెక్టర్, డ్యాన్స్‌మాస్టర్, నిర్మల్

అనుబంధాలను మేళవించాం...



తెలంగాణ జానపద సంప్రదాయం పాటల ద్వారానే కొత్త తరాలకు చేరువవుతోంది. నిర్మల్ జిల్లాలో బతుకమ్మ పాటల రచన, చిత్రీకరణ ద్వారా స్థానిక సంస్కృతి మరింతగా వెలుగులోకి వస్తుంది. తెలంగాణకు ప్రాణం లాంటి బతుకమ్మ పండుగను ప్రత్యేకంగా నిలబెట్టే విధంగా నిర్మల్ జిల్లాలో బతుకమ్మ పాటల సృష్టి, చిత్రీకరణ సాగించాం. – రామ్‌రాజ్ కాంద్రే, కెమెరామెన్, ఎడిటర్, నిర్మల్

వీక్షకులకు చేరువవుతుంది



స్థానిక జీవన విధానానికి దగ్గరగా జానపద సరళిలో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పాటను స్వరపరిచాం. యువతీ యువకులు, మహిళలను ఆకట్టుకునే విధంగా పండుగ వాతావరణంలో ఉండే ఈ పాట ప్రతీఒక్కరికి నచ్చుతుందని ఆశిస్తున్నాం. ఎంగిలిపూల బతుకమ్మ రోజున పాటను విడుదల చేశా. – ఎల్లుల నవీన్, రచయిత, సంగీత దర్శకుడు, నిర్మల్

బతుకమ్మ పాటల్లో మనోళ్లు..

- రచయితగా రాణిస్తున్న దినేష్‌కుమార్
- నృత్య దర్శకుడిగా ప్రత్యేకత చాటుకుంటున్న మధు


బతుకమ్మ పాటకు నృత్యశిక్షణ ఇస్తున్న మధు (ఫైల్)


బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన జంజిరాల దినేష్‌కుమార్ గాయకుడిగా, బతుకమ్మ పాటల రచయితగా రాణిస్తున్నాడు. తన 15 ఏళ్ల ప్రస్థానంలో కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజానీకానికి ఎంతో చేరువయ్యాడు. జానపద బాణీలతో జనరంజకమైన బతుకమ్మ పాటలు రచించి పలు వేదికల మీద ఆలపించడంతో యూట్యూబర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆ పాటలను యూట్యూబర్లు ప్రసిద్ధిగాంచిన జానపద నృత్యకళాకారులతో ప్రత్యేకంగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు 10కి పైగా బతుకమ్మ పాటలు రాయగా యూట్యూబ్‌లో వేలాది మంది వీక్షించడం గమనార్హం. తన రచనల ద్వారా బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుపుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి చాటి చెప్పడానికి తనవంతు కృషి చేస్తున్నాడు. బెల్లంపల్లికి చెందిన హన్మాండ్ల మధు రెండు దశాబ్దాలకు నృత్యకళాకారుడిగా రాణిస్తుండగా ఐదేళ్ల కాలం నుంచి బతుకమ్మ పాటలకు నృత్యదర్శకుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. దర్శక, నిర్మాతలు బెల్లంపల్లి చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో పాటలను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో రాణిస్తున్న పలువురు నృత్య కళాకారులకు మధు గురువు కూడా. అతని వద్ద నృత్యం నేర్చుకున్న యువతీ, యువకులు సామాజిక మాధ్యమాల కోసం చిత్రీకరించే జానపద, బతుకమ్మ పాటలపై నృత్యం చేస్తూ అలరిస్తున్నారు. మధు నృత్య దర్శకత్వం వహించిన బతుకమ్మపాటలు బహుళ ప్రజాదరణ పొందుతున్నాయి.

పాటలు పాడడం ఇష్టం



పాటలు పాడటం నాకు చిన్నతనం నుంచే అబ్బిన కళ. అనేక వేదికల మీద, సభలు, సమావేశాల్లో వందల సంఖ్యలో పాటలు పాడా. పలువురి కోరిక మేరకు బతుకమ్మ పాటలు రాయడం నేర్చుకున్నా. ఇప్పటికీ 10కి పైగా పాటలు రాశా. యూట్యూబ్‌లో నాపాటలు ప్రజాదరణ పొందడం ఆనందంగా ఉంది. ఇదే పట్టుదలతో ముందు మరిన్ని పాటలు రాస్తా. – జంజర్ల దినేష్‌కుమార్

నృత్యం ప్రత్యేకమైంది



ఇప్పటి వరకు వందల సంఖ్యలో జానపద, బతుకమ్మ, సినీ పాటలకు నృత్యం చేశా. బతుకమ్మపాటలకు నృత్య రీతులు అందించడం అంత తేలిక కాదు. తరాల నుంచి వస్తున్న బతుకమ్మ సంప్రదాయాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా నృత్యం చేయాల్సి ఉంటుంది. పదుల సంఖ్యలో బతుకమ్మ పాటలకు నృత్య దర్శకత్వం వహించిన నాకు ఎంతోమంచి పేరు వచ్చింది. – హన్మాండ్ల మధు, నృత్య దర్శకుడు

బతుకమ్మ విశిష్టతపై పాట..



మంచిర్యాలఅర్బన్: గతేడాది సద్దుల బతుకమ్మ నేపథ్యంలో బతుకమ్మ విశిష్టత, బతుకమ్మకు ఉపయోగించే ఒకనాటి ప్రాచీన పూల సంపద, తొమ్మిదిరోజులు అమ్మవారి అవతార విశేషాలను ఇనుమడింపజేసే ఒక్కేసి పువ్వేసి.. బతుకమ్మ గీతాన్ని రాసి వీడియోగా చిత్రీకరించి దాసరి మ్యూజిక్ అనే యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశా.
– దాసరి శ్రీనాథ్, కవి, పాటల రచయిత

జానపద వేడుక..



మంచిర్యాలఅర్బన్: సంప్రదాయం, సాంస్కృతిక నేపథ్యంలో జరుపుకునే జానపద వేడుక ఇది. భగవంతున్ని పూలతో పూజించటం కాక పూలనే పూజించటం బతుకమ్మ పండుగ ప్రత్యేకత. బతుకమ్మ పాటలకు ప్రజాదరణ ఎక్కువ. గ్రామాల్లో పాడుకునే పాటలనే వీడియో చిత్రీకరించాలని ఆలోచన చేశా. తల్లిబతుకమ్మ.. వరాల బతుకమ్మ.. బిత్తిరి సత్తి బతుకమ్మ తంగేడు పూల బతుకమ్మ లాంటి పాటలకు నృత్య దర్శకుడిగా వ్యవహరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశా.
– అద్దగూరి లక్ష్మీనారాయణ, నృత్యదర్శకుడు

భక్తితో ఆదమరిచి ఆడుకునే ఆట.



మంచిర్యాలఅర్బన్: బతుకమ్మ పాటల్లో మహిళలు తమ కష్టాసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయత, భక్తితో ఆదమరిచి ఆడుకునే ఆట. ఆశువుగా చెప్పే పాటలతో ఆడుకునే సంప్రదాయం కాస్తా డీజేలు వచ్చాక రికార్డింగ్ పాటలతో బతుకమ్మ హోరెత్తుతోంది. తెలంగాణ ఉద్యమం నుంచి ఈ పండుగ ఎంతో ప్రాచుర్యం పొందింది. తెలంగాణలో ప్రజలు తమ ఇంటి దేవతగా బతుకమ్మను పూజిస్తారు.
– వామన్‌రావు, కవి, రచయిత

తెలంగాణ ఉద్యమం నుంచి..

మంచిర్యాలఅర్బన్: 2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎన్నో పాటలు ఆలపించాను. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణలో జరిగే ఘనమైన బతుకమ్మ పండుగ సందర్భంగా యూట్యూబ్ ఛానల్ ఓపెన్ చేశా. 2019లో సింగర్ మానస ఆఫిసల్‌లో మొదటగా బతుకమ్మ పాట పాడా. 2025లో ఉయ్యాలో రామా.. ఉయ్యాలో అంటూ బతుకమ్మ పాట చేయటం జరిగింది. ఇప్పటి వరకు ఆరు బతుకమ్మ పాటలు పాడా. బతుకమ్మ పాటలకు ఎంతో ఆదరణ లభిస్తోంది.
– నూనె మానస, గాయని

బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలు


పూజాసామగ్రి తీసుకెళ్తున్న ఈవో, చైర్మన్

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో సోమవారం శ్రీ శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి నైవేద్యంగా కట్టెపొంగలిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి మహా రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనీదేవి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై శ్రీనివాస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారికి ఉచిత అన్నదాన ప్రసాదాన్ని గడిపుర బాబా జగదీష్ మహారాజ్, దేవస్థానం సమన్వయంతో వితరణ చేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. తలమడుగు మండలం కాపర్దేవికి చెందిన చిత్రకళ కిరాణా దుకాణం ఇప్పించాలని, ఇచ్చోడకు చెందిన కిరణ్ కుమార్ ట్రికార్ రుణం మంజూరు చేయాలని, జైనూర్ మండలం పాట్నపూర్‌కు చెందిన ఉత్తమ్ వాటర్ ప్లాంట్ ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ పెట్రోకార్‌ను ఢీకొన్న బైక్

భైంసాటౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీస్ పెట్రోకార్‌ను ఢీకొన్న ఘటన ఆదివారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ కోసం పెట్రోకార్‌లో హస్సల్ చౌక్ వద్ద రోడ్డు దాటుతుండగా పిప్రి కాలనీకి చెందిన కొలవాడ ఉమేశ్ బైక్‌పై భైంసా వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ లస్మన్నకు గాయాలు కాగా వాహనం పాక్షికంగా దెబ్బతింది. బైక్‌పై ఉన్న ఉమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను ఏరియాస్పత్రికి తరలించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని రూరల్ సీఐ నైలు సూచించారు.

వర్క్‌ఫ్రమ్ హోం పేరిట రూ.5లక్షలు టోకరా

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.5 లక్షలు పోగొట్టుకుందని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సదరు మహిళ ఫేస్‌బుక్ ఖాతాకు వర్క్ ఫ్రమ్ హోం అనే పార్ట్‌టైమ్ జాబ్ ఉందని ఓ గుర్తు తెలియని వ్యక్తి లింక్ పంపించాడు. అది ఓపెన్ చేసి అందులో ఉన్న హోటల్స్‌కు సంబంధించి రివ్యూస్ చేయడంతో పాటు ఇచ్చిన టాస్కులు కూడా పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు మహిళను నమ్మించారు. అలాగే ఆన్‌లైన్ బిజినెస్‌లో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మబలకడంతో సదరు మహిళ రూ. 5లక్షలు విడతల వారీగా పంపింది. విత్‌డ్రా కోసం సైబర్ నేరగాళ్లను సంప్రదించగా వారు మరో రూ.5లక్షలు ఇవ్వాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సోమవారం పోలీస్‌స్టేషన్‌తో పాటు 1930కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందినట్లు ఎస్సై మజారొద్దీన్ సోమవారం తెలిపారు. మృతుడు ఆరెంజ్ కలర్ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ 8712656534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

9,11 తరగతుల్లో ప్రవేశ గడువు పొడగింపు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి గడువు అక్టోబర్ 7 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొమ్మిదిలో ప్రవేశానికి https:// cbseitms. nic. in /2025/nvsix_9 11వ తరగతిలో ప్రవేశానికి https: //cbseitms. nic.in /2025/ nvsxi_11 వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సౌరభ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ప్రేమపేరిట బాలికను కిడ్నాప్ చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడి ఫోన్ ట్రేస్ చేయగా మహారాష్ట్రలోని లాతూర్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

తలమడుగు: మండలంలోని బరంపూర్ సమీపంలో కొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై రాధిక తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన స్థానికులు గమనించి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఫణీందర్, ఎస్సై రాధిక క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆలయ పరిసరాలు పరిశీలించారు. హుండీలో ఉన్న రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్‌లో..

తానూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. వైన్స్ వెనుక భాగం నుంచి ఉన్న రేకులను తొలగించిన దుండగులు లోనికి చొరబడి రూ.లక్ష విలువైన మద్యం బాటిళ్లతో పాటు రూ.8 వేల నగదు, సీసీ ఫుటేజీలను తీసుకువెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం వైన్స్ సిబ్బంది వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లేశ్, ఎస్సై షేక్ జుబేర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బ్యాటరీల చోరీ నిందితుడి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

ఇంద్రవెల్లి: బ్యాటరీలు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత జూలై, ఆగస్టులో మల్లాపూర్, పిప్రి గ్రామపంచాయతీల్లో 6, సిరికొండ మండలంలోని కొండపూర్‌లో 3, గుడిహత్నూర్ మండలం రాఘపూర్‌లో 3 టీఫైబర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. టీ ఫైబర్ ఫీల్డ్ మెనేజర్ చిట్యాల రాజు గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్‌కు చెందిన పైతానే ధన్‌రాజ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆగస్టు 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడికోసం గాలిస్తున్న పోలీసులు సోమవారం పైతానే ధన్‌రాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో బ్యాటరీలను దొంగిలించి గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన షేక్ రహీంకు విక్రయించినట్లు చెప్పడంతో అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతిని వేధించిన ఆటోడ్రైవర్

- అమ్మాయి తరపు బంధువుల దాడి
- ఇరువర్గాలపై కేసు నమోదు


వివరాలు సేకరిస్తున్న ఎస్సై శ్యాంపటేల్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని అస్నాద రోడ్డులోఘర్షణ పడిన ఘటనలో ఇరువర్గాలపై కేసునమోదు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కోటపల్లి మండలంలోని బబ్బెర చెలుక గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం తన వదినతో కలిసి దుర్గామాత ఉత్సవాల సామగ్రికోసం చెన్నూర్‌కు వచ్చింది. అస్నాద రోడ్డులోని ఓ దుకాణంలో షాపింగ్ చేశారు. కోటపల్లి మండలం లింగన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్లు ఆసంపల్లి శేఖర్, రఘు, రఘు, శ్రీకాంత్, కోనం అంజన్న అదేషాపులో సామగ్రి కొనుగోలుకు వచ్చారు. యువతి బయటకు వెళ్లిపోతుండగా ఆసంపల్లి శేఖర్ ఆమె దుస్తుల విషయమై కామెంట్ చేయడంతో ఆగ్రహానికి గురై అతడిని చెప్పుతో కొట్టింది. డ్రైవర్ కూడా ఆమెపై దాడి చేసి దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు ఆటోను ధ్వంసం చేసి డ్రైవర్లతో ఘర్షణకు దిగారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఎస్సై శ్యామ్‌పటేల్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధిత యువతి, శేఖర్ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎడ్లబండిపై వాగు దాటుతూ మహిళ గల్లంతు

- గేదె, ఎద్దు మృతి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకీ షర్మిల


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసారూరల్: మండలంలోని బిజ్జూర్–బాబుల్‌గాం గ్రామాల మధ్య ఉన్న వాగును ఎడ్లబండిపై దాటుతుండగా మహిళ గల్లంతైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బిజ్జూరుకు చెందిన నగేశ్‌రెడ్డి అనే రైతు పాలేరు మాటేగాం గ్రామానికి చెందిన సురేశ్ ఎడ్లబండికి వెనుకాల గేదెను కట్టుకుని పంట పొలానికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతని చేను పక్కనే ఉన్న గంటోళ్ల లక్ష్మీబాయి తానూ ఎడ్లబండిపై వస్తానని చెప్పడంతో సురేశ్ ఆమెను ఎక్కించుకున్నాడు. గ్రామ సమీపంలోని చిన్న సుద్దవాగు దాటుతుండగా ఒకేసారి ఎగువ నుంచి రంగారావు ప్రాజెక్టు నీరు రావడంతో ఎడ్లబండి వాగులోని గుంత వైపుకువెళ్లి మునిగిపోయింది. ఈ ఘటనలో లక్ష్మీబాయి గల్లంతుకాగా ఎద్దు, గేదె మృతి చెందాయి. సురేశ్ ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గజ ఈతగాళ్లతో వెతికించినా మహిళ ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్పీ అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురిసినప్పుడు నదులు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని స్థానికులకు సూచించారు.


● ఆస్కార్ ఎంట్రీ

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను 'మీ ఊరికి పోండి' అని సాటి మనుషులే తరిమికొడితే 'ఇంటి వైపు' నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన 'హోమ్‌బౌండ్' ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.
కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.
సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.
ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.
ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.
బహుశా ఆ చప్పట్ల మోత 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా'ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.
పేరు: హోమ్‌బౌండ్.

నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. 'టేకింగ్ అమృత్ హోమ్' అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో. వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి 'హోమ్‌బౌండ్'ను తీశాడు.

అదే దర్శకుడికి అదే గుర్తింపు

'హోమ్‌బౌండ్' (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘెవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన 'మసాన్' సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్త్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే 'హోమ్‌బౌండ్'కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్‌బౌండ్' రెండవ స్థానంలో నిలిచింది. 'మసాన్' సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

ఇద్దరు స్నేహితుల కథ

'హోమ్‌బౌండ్' షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ 'దేశం' అనే 'ఇల్లు' వీరికి 'కొందరికి' ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. 'కానిస్టేబుల్ ఉద్యోగం' వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వి కపూర్ నటించింది. కరణ్ జొహార్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.
ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.



'జిన్ షిన్ జ్యుషు' అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్.

నవశక్తి

'ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..

ఫైర్ ముఖ్యం





"మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రైనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రైనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రైనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రైనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను" అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,16,410	1,08,250	1,39,000
విజయవాడ	1,14,500	1,06,300	1,36,400
విశాఖపట్నం	1,13,070	1,03,650	1,48,000
రాజమండ్రి	1,14,500	1,06,300	1,36,400
ప్రొద్దుటూరు	1,15,200	1,05,980	1,37,000
చెన్నై	1,13,020	1,03,600	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్ఐపీహెచ్ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సీ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.



సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుగులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.

మునగ మేలు!







- మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
- ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
- మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
- ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్లు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.

బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
సగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్మొచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షా కాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754